షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1 YEAR HAPPY WORK ANNIVERSARY...
సంపుటి : 2 సంచిక : 14 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 25 నవంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు
VOLUME : 02 ISSUE : 14 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 25 Novmbar 2024 PAGES : 8 PRICE : 5/-

# చంద్రబాబు కొత్త స్కెచ్



- జగన్‌కు ఉచ్చు,
- ఢిల్లీలో సీన్ ఛేంజ్..!!
- జగన్ పేరు ప్రస్తావన పైన కూటమి ఆచి తూచి స్పందిస్తోంది
- కేంద్రంతో ఉన్న సత్సంబంధాల కారణంగా ఆదానీ వివాదం పైన స్పందించటం లేదు
- కానీ, ఈ కేసులో జగన్ ను మాత్రం ఫిక్స్ చేయాలని భావిస్తున్నారు

**అమరావతి**

ఆదానీ కేసులో జగన్ ను ఫిక్స్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే అమెరికా కోర్టులో ఆదానీ ఏపీలో విద్యుత్ ఒప్పందాల కోసం లంచాలు ఇచ్చారని అభియోగాలు నమోదయ్యాయి. జగన్ పేరు ప్రస్తావన పైన కూటమి ఆచి తూచి స్పందిస్తోంది. కేంద్రంతో ఉన్న సత్సంబంధాల కారణంగా ఆదానీ వివాదం పైన స్పందించటం లేదు. కానీ, ఈ కేసులో జగన్ ను మాత్రం ఫిక్స్ చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం న్యాయ పరంగా..అదే విధంగా రాజకీయంగానూ మంతనాలు చేస్తున్నారు. కానీ, ఢిల్లీ నేతల అభిప్రాయమే ఇక్కడ కీలకంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం కసరత్తు విద్యుత్ ప్రాజెక్టు ముడుపుల వ్యవహారంలో మాజీ సీఎం జగన్ ను వదల కూడదని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసు పైన కూటమిలోని ముఖ్య నేతలు మాత్రం ఇప్పటి వరకు అధికారి కంగా స్పందించ లేదు. కేంద్ర ప్రాజెక్టు సెకీతో నాడు జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఆదానీ కేసులో ఇదే సాంకేతికంగా కీలకం కాబోతోంది. - మిగతా3లో



# అల్పపీడనం వాయుగుండంగా

**ఏపీకి మూడు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక!**

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వర్షాలు వదిలిపెట్టడం లేదు. చలి తీవ్రత పెరుగుతున్న నవంబర్ నెలలోనూ ఏపీని వాన వెంటాడుతూనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా ఏర్పడబోతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా - మిగతా3లో

# విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్‌బాల్ ఆడుకుంది జగనే

**చిక్కీ డబ్బులు కూడా చెల్లించని జగన్..**

**ఇప్పుడు సుద్దపూసలా కబుర్లు చెబుతున్నాడు: మంత్రి లోకేశ్**

**సుప్పినీ... సుద్దపూస అంటూ జగన్‌కు ఐదు పాయింట్లతో కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్**

**కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది**

**మూడు విడతల ఫీజు రీఎంబర్స్ మెంట్ చేయలేదని ఆరోపణ**

**చెత్త పాలన మీది అంటూ ఏకిపారేసిన నారా లోకేశ్**

**నా నెత్తిన రూ.6,500 కోట్ల బకాయిలు పెట్టారంటూ ఆగ్రహం**




**అమరావతి**

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, మూడు విడతల ఫీజు రీఎంబర్స్ మెంట్ చేయకపోవడంతో విద్యార్థులు చదువు మానుకోవాల్సి వస్తోందని వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియాలో ధ్వజమెత్తడం తెలిసిందే. దీనిపై ఏపీ విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అంశాల వారీగా ఐదు పాయింట్లతో బదులిచ్చారు. 1. చిన్న పిల్లల చిక్కీ డబ్బులు సైతం ఎగ్గొట్టిన సుప్పిని తాను సుద్దపూసని అనడం విచిత్రంగా ఉంది - మిగతా3లో

# రెండు రోజులే గడువు..

- లేదంటే మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన
- సీఎం కుర్చీ ఎవరనేదానిపై కూటమి పార్టీల మధ్య చర్చలు
- మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన అంటూ మరో వార్త హల్‌చల్
- స్పష్టమైన మెజార్టీ మహాయుతి కూటమికి వచ్చిన తర్వాత కూడా రాష్ట్రపతి పాలన విధించడం ఏమిటనే చర్చ




# 29న విశాఖకు ప్రధాని మోదీ

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన**

**ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బహిరంగ సభ**

**సీఎం చంద్రబాబు,**

**ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**విశాఖపట్టణం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంకు రానున్నారు. పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లపై విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ఆదివారం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. - మిగతా3లో

# విశాఖ రైల్వే జోన్ ప్రక్రియలో మరో ముందడుగు




- కేంద్రమంత్రి కీలక ప్రకటన..
- ఉత్తరాంధ్ర వాసుల దశాబ్దాల కల ఎట్టకేలకు సాకారమవుతోంది.
- విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా ముందుకు సాగుతోంది.
- తాజాగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం.
- ఈ మేరకు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఎక్స్‌లో కీలక ప్రకటన చేశారు.



# సోషల్ మీడియాతో న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్నారు..!

- మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు..!
- భారత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న చాలా తీవ్రమైన సమస్య
- కేసుల తీర్పులను ప్రభావితం చేసేందుకు కొందరు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు.
- కోర్టుల నిర్ణయాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించేరందుకు ప్రతి పౌరుడికి హక్కు ఉంది
- ప్రజాస్వామ్యంలో చట్టాల చెల్లుబాటును నిర్ణయించే అధికారం రాజ్యాంగ న్యాయస్థానాలకు అప్పగించాం

# విద్యార్థులపై కక్షగట్టిన చంద్రబాబు

- ఫీజులు చెల్లించలేక చదువులు మానేస్తున్నారని జగన్ ఆరోపణ
- చంద్రబాబు పాలనలో అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోంది
- ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారు
- విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది: వైఎస్ జగన్
- అమ్మకు వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతిదీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలి



**అమరావతి**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకనోవడంతో విద్యార్థులు చదువులు మానేసుకుంటు న్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులపై కక్షగట్టినట్టు వ్యవహరిస్తున్నారని ఆదివారం ట్విటర్‌లో ఆరోపించారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని రంగాల్లోనూ- మిగతా3లో

**అదానీ లంచాల వ్యవహారంపై**

# పార్లమెంట్‌లో చర్చించాలి

- అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ డిమాండ్
- వక్ఫ్ సవరణ బిల్లు, మణిపూర్ హింసాకాండపై చర్చకు డిమాండ్ చేసే అవకాశం
- శీతాకాల సమావేశాలు సోమవారం నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి.



# విద్యార్థులపై కక్షగట్టిన చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

తిరోగమనమే కనిపిస్తోందని, ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో తీసుకొచ్చిన విద్యా పథకాలన్నింటినీ రద్దుచేసి విద్యార్థులను, వారి తల్లులను దెబ్బతీశారని ఆరోపించారు. వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి, డిగ్రీ, ఇంజనీరింగ్, డాక్టర్ చదువులు చదువుతున్నవారినీ తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారని విమర్శించారు.

తమ పాలనలో ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో జమచేసే వాళ్లమని, గత విద్యాసంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకూ రూ. 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా జనవరి–మార్చి త్రైమాసికానికి, ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు డబ్బులు ఇవ్వనీయకుండా ఇదే కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశారని ఆరోపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మూడు త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు చెల్లించాల్సి ఉందని వెల్లడించారు.

ప్రభుత్వం తీరుచూస్తే మాటలేమో కోటలు దాటుతున్నాయి, కాళ్లేమో గడపకూడా దాటడం లేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వం వచ్చాక ఇసుక స్కాం, లిక్కర్ స్కాం, పేకాట క్లబ్బులు, మాఫియా



సామ్రాజ్యాలు, ప్రైవేటీకరణ ముసుగులో స్కాములకు పాల్పడుతున్నారని అన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా అమ్మకు వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా వసతి దీవెన డబ్బులు విడుదలచేయాలని డిమాండ్ చేశారు. పిల్లల చదువులను దెబ్బతీసే చంద్రబాబు నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని వైఎస్ జగన్ తెలిపారు.

విద్యార్థులపై కక్షకట్టినట్టు సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం తనకు ఆవేదన కలిగించిందన్నారు. చంద్రబాబు రాగానే అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందన్న జగన్, ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. అమ్మ ఒడిని, ఇంగ్లీష్ మీడియం, 3వ తరగతి నుంచి టోఫెల్, సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్ఈ, ఐబీ తొలగించారన్నారు. 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్, నాడు–నేడు ఇలా అన్నింటినీ రద్దుచేసి 1–12వ తరగతి విద్యార్థులను, వారి తల్లులను దెబ్బతీశారన్నారు.

ప్రభుత్వం వచ్చి 5 నెలలు దాటినా పైసా విడుదల చేయలేదు: వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి డిగ్రీ, ఇంజనీరింగ్, డాక్టర్ చదువులు చదువుతున్నవారినీ తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నారని ఆక్షేపించారు. జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు మొత్తాన్ని ఎన్నికల పేరుతో ఇవ్వకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేసి ఆపేశారన్నారు. 2 వేల 800 కోట్ల రూపాయలకుపైగా ఫీజులు రీయింబర్స్ నిధులు, మరో రూ.1,100 కోట్లు వసతిదీవెన బకాయిలు కలిపి మొత్తంగా డిసెంబర్ నాటికి 3 వేల 900 కోట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వచ్చి 5 నెలలు దాటినా పైసా విడుదల చేయలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకూడదని, దీనిపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చించాలని వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంపైనా చర్చ జరగాలన్నారు. పార్లమెంట్?లో అన్ని పార్టీలు చర్చించి డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియా కార్యకర్తలను దారుణంగా హింసిస్తున్నారని ఆరోపించారు.

# 29న విశాఖకు ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

రోడ్ షో నిర్వహణ, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభ నిర్వహణ, ప్రజల సీటింగ్ ఏర్పాట్లు, రవాణా సదుపాయం తదితర అంశాలపై విశాఖపట్టణం ఎంపీ ఎం. శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, రోడ్ షో, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర కనీస వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలపై ముందుగా జిల్లా కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నందున వారు ఉండేందుకు బస ఏర్పాట్లపై చేపట్టబోతున్న ప్రాథమిక చర్యలను వెల్లడించారు. గవర్నర్ నోవోటెల్, ముఖ్యమంత్రి పోర్టు గెస్ట్ హౌస్ లో ఉండేందుకు ప్రాథమికంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గం లేదా వాయు మార్గం ద్వారా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారని, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని వివరించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, పూర్తైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చినట్లయితే టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు ప్రధాని రోడ్ షో ఉండొచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రాథమికంగా జిల్లా యంత్రాంగం నుంచి చర్యలు చేపడతున్నట్లు ప్రజా ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

లిప్రధాని పర్యటన షెడ్యూల్ ఇలా.. విశాఖపట్టణం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే బహిరంగ సభ, రోడ్ షో పర్యటన సందర్భంగా ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3.40 గంటలకు వాయు మార్గం ద్వారా ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయక్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి ప్రధాన వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు 500 మీటర్ల మేర రోడ్ షో నిర్వహిస్తారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ప్రధాని బహిరంగ సభకు చేరుకుంటారు. అక్కడ నిర్దేశించి కార్యక్రమంలో 4.45 నుంచి 5.00 గంటల వరకు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడటంతో పాటు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలతో కలిసి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం 5.45 గంటలకు సభ నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు.

పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాధుర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్‌బాల్ ఆడుకుంది జగనే

-మొదటిపేజీ తరువాయి

జగన్ గారు! గుడ్లు, చిక్కీలు మొదలుకొని ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిల వరకూ మీరు నా నెత్తిన పెట్టి పోయిన బకాయిలు అక్షరాలా రూ. 6,500 కోట్లు. ఫీజు మొత్తం కడతానని చేతులెత్తేసిన చెత్త పాలన మీది. ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాన్ని మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్ బాల్ ఆడుకుంది మీరు.

2. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతారాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం మీకే చెల్లింది సుప్పిని జగన్ గారు. విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే సర్టిఫికెట్లు రాక లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

నేను యువగళం పాదయాత్ర చేసేటప్పుడే మీ నిర్వాకాన్ని విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకొని సమస్య పరిష్కరించాం. గత ప్రభుత్వ బకాయిలను విడతలవారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాల్సిందిగా కళాశాలలను ఆదేశించాం. ఇకపై ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం.

3. అర్ధరాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం నిర్ణయాలు తీసుకుని గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లలో



రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 4 లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా?

ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధంగా చెయ్యకుండానే సిబిఎస్ఈ పరీక్షా విధానం తీసుకొచ్చారు. మేం అధికారంలోకి వచ్చాక సీబీఎస్ఈ పరీక్షా విధానంలో నిర్వహించిన పరీక్షల్లో 90శాతం మంది ఫెయిలయ్యారు. నీ నిర్ణయాలు బ్లైండ్‌గా ఫాలో అయితే ఆ పిల్లలు అంతా బోర్డు పరీక్షల్లో తప్పి డిప్రెషన్లోకి వెళ్లేవారు.

ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా, టోఫెల్, ఐబీ శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేసామని డబ్బా కొట్టుకోవడం. ఇలా ఒక్కటేంటి విద్యా వ్యవస్థను నాశనం చేసిన పాపం మీదే జగన్ గారు.

4. నాడు – నేడు అంటూ పబ్లిసిటీ పీక్‌కు తీసుకెళ్లారు కానీ విషయం వీక్ అని తేలింది. నా క్షేత్రస్థాయి పర్యటనల్లో కనీసం పిల్లలు కూర్చోడానికి బల్లలు, తాగునీరు, టాయ్ లెట్లు లేని పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇక ట్యాబులు ఇంటికి ఇవ్వడం వలన జరుగుతున్న అనర్థాలను మీరు నేరుగా తల్లితండ్రులను అడిగి తెలుకోవచ్చు. అందుకే మేము స్కూళ్లలోనే పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

5. రాష్ట్రంలో గత ఐదేళ్లలో మీ వల్ల భ్రష్టు పట్టిన విద్యారంగాన్ని గాడిన పెట్టడం మా బాధ్యత. మీరు చేసిన విధ్వంసాన్ని ఒక్కొక్కటిగా సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీతో భర్తీచేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేసి తీరుతాం.

లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు భ్రమింపజేసే కనికట్టు విద్యలో మాస్టర్స్ చేసిన మీకు విద్యారంగంలో మేం చేస్తున్న మంచిపనులు కన్పించకపోవచ్చు. ఎవరేమనుకున్నా రాబోయే ఐదేళ్లలో ఏపీ విద్యారంగాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దాలని చంద్రబాబుగారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పించింది. మీలాంటి మారీచులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా విద్యారంగ సంస్కరణల విషయంలో మా అడుగు ముందుకే!

## బీజేపీకి కొత్త ఛీఫ్

**విజయవాడ :** భారతీయ జనతా పార్టీ త్వరలో దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో అధ్యక్షులను మార్చనుంది. తెలుగు రాష్ట్రాలకూ కొత్త అధ్యక్షులు రానున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం గట్టి పోటీ నడుస్తోంది. ఏపీలోనూ అధ్యక్ష పదవి మార్చాలని హైకమాండ్ నిర్ణయించింది. ఇప్పటికే పార్టీలోని అత్యున్నత నిర్ణాయక కమిటీ ఈ మేరకు అభిప్రాయ సేకరణ జరిపి నలుగురు పేర్లను షార్ట్ లిస్టు చేసినట్లుగా తెలుస్తోంది. ఇందులో ఇద్దరు ఇతర పార్టీల నుంచి వచ్చిన సీనియర్లుకాగా.. మరో ఇద్దరు ఆరెస్సెస్ నుంచి పార్టీ కోసం పని చేస్తున్న యువనేతలు ఉన్నట్లుగా బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఏపీ బీజేపీ ప్రస్తుత అధ్యక్షురాలు పురందేశ్వరికి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంది. నిజానికి ఆమె మొదటి నుంచి జాతీయ రాజకీయాల్లో ఉన్నారు. ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా పురందేశ్వరికి పగ్గాలు ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో చురుగ్గా పని చేసే యువనేతకు చాన్స్ ఇస్తే.. పార్టీ కార్యకలాపాలు వేగం పుంజుకుంటాయని భావిస్తున్నారు. అద్యక్ష పదవిని మార్చాలని డిసైడైన తర్వాత పార్టీ నేతల నుంచి అభిప్రాయాలు సేకరించి.. సామాజికవర్గ సమీకరణాలను వడపోసిన తర్వాత నలుగురు పేర్లను ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆ నలుగురులో ఇద్దరు సీనియర్లు సుజనా చౌదరి, ఆదినారాయణరెడ్డి ఇద్దరు ఉపాధ్యక్షులైన యువనేతలు విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. సామాజిక సమీకరణాలు, అనుభవం, పార్టీపై విధేయత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అధ్యక్షుడిని ఖరారు చేయనున్నారు. సుజనా చౌదరి, ఆదినారాయణ రెడ్డి సుదీర్ఘ కాలం ఇతర పార్టీల్లో పని చేసి వచ్చారు. వారికి బీజేపీ భావజాలంపై ఎంత పట్టు ఉందన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. అదే సమయంలో వారికి చాన్సిస్తే బీజేపీని సిద్ధాంతపరంగా అంటి పెట్టుకుని ఉండే క్యాడర్ ఎంత వరకు పని చేస్తారో చెప్పలేమన్న అభిప్రాయాలు ఎక్కువగా హైకమాండ్‌కు చేరుతున్నట్లుగా తెలుస్తోంది. పైగా వారు ఎమ్మెల్యేలుగా బాధ్యతల్లో ఉన్నారని..వారికి ఉన్న ఇతర వ్యాపకాలతో పార్టీకి పూర్తి సమయం కేటాయించడం కష్టమన్న వాదన కూడా ఉంది. ఇక రేసులో ఉన్న ఇద్దరు యువనేతలు, ప్రస్తుతం ఉపాధ్యక్షులుగా ఉన్న విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ్ విషయంలో మాత్రం పెద్దగా అభ్యంతరాలు హైకమాండ్‌కు ఎవరూ చెప్పడం లేదంటున్నారు. వారిద్దరూ మొదటి నుంచి ఆరెస్సెస్, బీజేపీతో పెరిగారు. ఆరెస్సెస్ భావజాలంతో రాజకీయాలు చేస్తున్నారు. ఆరెస్సెస్ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. యువనేతలు .. ఇద్దరరికీ వేరే వ్యాపకాలు లేవు కాబట్టి పూర్తి స్థాయి సమయం పార్టీకి కేటాయిస్తారు. అదే సమయంలో ఏబీవీపీలోనూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో చురుకైన పాత్ర కూడా పోషించారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని అధ్యక్షుడి ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బీజేపీ అధికార కూటమిలో ఉంది. ఈ సమయంలో కింది స్థాయి నుంచి విస్తృతంగా పర్యటిస్తూ.. పార్టీని బలోపేతం చేసేది యువనేతలేనని ఎక్కువ మంది హైకమాండ్‌కు చెబుతున్నారు. చాలా కాలంగా ఏపీలోరెడ్డి సామాజికవర్గానికి అవకాశం కల్పించలేదు. అదే సమయంలో ఆ వర్గం నుంచే బీజేపీకి ఎక్కువ సపోర్టుగా ఉన్నారు. రాయలసీమలో రెడ్డి వర్గం మద్దతుతో గతంలో మంచి ఫలితాలు సాధించేది. అలాగే రాయలసీమ ప్రాంతానికి కూడా ఏపీ బీజేపీ చీఫ్ పదవి కేటాయించలేదు. ఇవన్నీ చూస్తే రాయలసీమ ప్రాంతానికి చెంది..

## విశాఖ రైల్వే జోన్ ప్రక్రియలో మరో ముందడుగు..

విశాఖపట్నంలో ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని ఏపీ విభజన చట్టంలో హామీ ఇచ్చింది నాటి కేంద్ర ప్రభుత్వం. అయితే గత పదేళ్లుగా ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా జోన్ వ్యవహారం ముందుకు సాగలేదు. ఇటీవల ఏపీ ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించడంతో కేంద్రం నుంచి విశాఖ రైల్వేజోన్‌పై కదలిక వచ్చింది. తాజాగా విశాఖపట్నంలో జోనల్ కార్యాలయం నిర్మాణానికి టెండర్ ప్రక్రియను ప్రారంభించింది..రైల్వేశాఖ. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్‌లో స్వయంగా ఈ విషయం ప్రకటించారు. దీంతో విశాఖ వాసుల్లో ఆనందం నెలకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల29న విశాఖ పర్యటనకు వస్తున్నారు. ఉత్తరాంధ్రలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విశాఖ రైల్వే జోన్‌కు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారని చెబుతున్నాయి రైల్వే వర్గాలు.. ఈ క్రమంలోనే రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం.. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటుకు ఇప్పటికే 53 ఎకరాల భూమిని రైల్వేశాఖకు అప్పగించింది రాష్ట్రప్రభుత్వం. మొత్తం 11 అంతస్తుల్లో 149.16 కోట్ల వ్యయంతో జోనల్ కార్యాలయ నిర్మాణం చేపడుతోంది రైల్వేశాఖ. టెండర్లు దాఖలు చేసేందుకు డిసెంబర్ 27 వరకూ గడువు విధించింది. టెండర్లు దక్కించుకున్నవాళ్లు రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని రైల్వేశాఖ స్పష్టం చేసింది. అయితే భవనం పూర్తయ్యేవరకూ ఎదురు చూడకుండా తాత్కాలిక భవనాల్లో అయినా సౌత్‌కోస్ట్ జోన్ కార్యకలాపాలను ప్రారంభించాలని విశాఖ వాసులు కోరుతున్నారు

## చంద్రబాబు కొత్త స్కెచ్

-మొదటిపేజీ తరువాయి

అటు ఆదానీ అంశం కావటంతో కూటమి నేతలు ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో బీజేపీ నాయకత్వం ఆలోచన ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆదానీ గురించి ప్రస్తావన లేకుండా జగన్ పైన ఏ విధంగా ముందుకు వెళ్లే అవకాశం ఉందనేది పరిశీలిస్తున్నారు.

న్యాయ సలహా కోసం సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవడానికి రూ.1750 కోట్ల లంచం ఇచ్చారని చార్జిషీటులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఉన్నారని చార్జిషీటులో నిర్దిష్టంగా ప్రస్తావించారు. దీని ఆధారంగా జగన్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చా అన్న కోణంలో కూటమి ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరింది. ఈ మేరకు న్యాయ నిపుణుల సలహా ఇందుకు సానుకూలంగా వస్తే జగన్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతిని ప్రభుత్వం కోరే అవకాశం కనిపిస్తోంది. అవినీతి నిరోధక చట్టంలోని 17 ఏ అధికరణం ప్రకారం మాజీ సీఎంను అరెస్టు చేసి విచారణ జరపడానికి గవర్నర్ అనుమతి అవసరమని ప్రభుత్వంలోని ముఖ్యులు గుర్తు చేస్తున్నారు.

ఢిల్లీ అభిప్రాయం మేరకు తాజాగా అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ఇదే అంశం పైన పలువురు సభ్యులు సభలో ప్రస్తావన చేసారు. జగన్ పైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేసారు. కానీ, ముఖ్యమంత్రి స్పందించారు. ఎట్టి పరిస్థితుల్లో అవినీతి సహించబోమని ..అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో ప్రధానంగా ఆదానీ పైన ఆరోపణలు రావటంతో కేంద్రంతో చర్చలు చేయాలని భావిస్తోంది. ఆదానీ పాత్ర పైన బీజేపీ ఏ రకంగా స్పందిస్తుంది..జగన్ పైన చర్యలకు దిగితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయనే అంశం పైన అభిప్రాయాలు తీసుకుంటున్నారు. దీని పైన ఢిల్లీ నేతలతో చర్చించిన తరువాతనే తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. దీంతో, ఇప్పుడు ఢిల్లీ అభిప్రాయం కీలకంగా మారుతోంది.

## అల్పపీడనం వాయుగుండంగా

-మొదటిపేజీ తరువాయి

మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు రోజుల పాటు వర్షాలు రేపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండం గా మారే అవకాశం ఉందని దీని ప్రభావంతో ఈ నెల 27, 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఏపీలోని కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

నవంబర్ 25వ తేదీన వాయుగుండంగా బలపడే అవకాశం తూర్పు హిందూ మహాసముద్రం మరియు దానిని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాల పైన నవంబర్ 25వ తేదీన వాయుగుండం గా బలపడేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. రైతులకు అలెర్ట్ దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక వర్షాలు కురిసేందుకు రెండు రోజుల సమయం ఉన్నందున ముఖ్యంగా రైతులు వరి కోతకు వచ్చిన సమయంలో ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఏపీలో వర్షాలపై ఏపీ విపత్తుల నిర్వహణా సంస్థ అలెర్ట్ రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో అది వాయువ్యదిశగా కదులుతూ ఆ తర్వాత రెండు రోజుల్లో తమిళనాడు, శ్రీలంక తీరాల వైపు వెళ్లే ఛాన్స్ ఉన్నదని రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఏపీలో కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురవగా మిగిలిన చోట్ల అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు కురిసే నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## సిట్ వర్క్ షురూ..

**తిరుమల:** దేశవ్యాప్త సంచలనంగా మారిన తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు విచారణ వైపు అడుగులు వేస్తోంది. ఔఆఆః కాఫ్ నివేదిక ఆధారంగా నెయ్యిలో కల్తీ నిజమేనన్న టీటీడీ వాదన, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్న కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఎట్టకేలకు సుప్రీం కోర్టు దాకా వెళ్ళిన వ్యవహారంలో కేంద్ర బృందం కల్తీ నెయ్యి కేసును విచారించబోతోంది. శ్రీహరి భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న అభియోగాలు, ఆరోపణల్లో నిజాలు నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో ఉండే అధికారులపై ఇప్పటికే స్పష్టత కూడా వచ్చింది. ఐదు మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏపీ ప్రభుత్వం నుంచి గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టీల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక సీబీఐ తరఫున పాల్గొనే విచారణ అధికారుల పేర్లను ఆ దర్యాప్తు సంస్థ కూడా ఇప్పటికే ప్రకటించింది. సీబీఐ హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, విశాఖ ఎస్పీ మురళి రాంబాతో పాటు ఎఫ్ఎస్ఎస్ఏఐ (నాణ్యత హామీ) సలహాదారు డాక్టర్ సత్యేన్ కుమార్ పాండాలను నియమించింది. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ సిట్ పని చేయనుండగా, ఇప్పటికే ఏపీ సర్కార్ సిట్ ను ఏర్పాటు చేసి కొంతమేర విచారించింది. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేయడానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని అధికారుల బృందంతో కొంత దర్యాప్తు కూడా పూర్తి చేయించింది. విచారణ అధికారుల బృందం 3 రోజుల పాటు తిరుపతి, తిరుమలలో కూడా పర్యటించింది. కల్తీ నెయ్యి సరఫరాపై కేసు పెట్టిన ప్రొక్యూర్మెంట్ జీఎం మురళీకృష్ణ నుంచి వాంగ్మూలం తీసుకోవడంతో పాటు పిండిమర, ల్యాబ్ లను పరిశీలించి ప్రాథమిక నివేదిక రూపొందించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిట్ ను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రాథమిక సమాచార సేకరణలో భాగంగా సీబీఐ సిట్ బృందం టిటిడిలో సరకుల కొనుగోలు విధానం, టెండర్ల ప్రక్రియ, ల్యాబ్ లలో పరీక్షల తీరుపై వివరాలు సేకరించింది. నెయ్యి సరఫరా కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థ మరో సంస్థ నుంచి సరకు సేకరించడం, ఆ సంస్థ మరో కంపెనీ నుంచి కొనుగోలు చేసిందన్న కొంత సమాచారాన్ని రాబట్టింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర పరిశీలన చేసి, నివేదిక ఇవ్వబోతుండగా, సిట్ ఎంక్వయిరీ కి అవసరమైన ప్రత్యేక కార్యాలయం, కావాల్సిన వసతులపై సీబీఐ టీటీడీకి లేఖ కూడా రాసింది. క్షేత్రస్థాయిలో దర్యాప్తునకు సిద్ధమైన సిట్ టీం సహాయ సహకారాలు అందించేందుకుగాను 30 మంది అధికారులను తీసుకోనుంది. డీఎస్పీ స్థాయి నుంచి మినిస్టీరియల్ సిబ్బంది వరకు అవసరం ఉంటుందని భావించింది. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించిన దర్యాప్తు బృందం అధికారులను కూడా ఎంపిక చేసుకోనుంది. కల్తీ నెయ్యి కేసు దర్యాప్తును తిరుపతి నుంచి చేపట్టేందుకు అనుగుణంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోనుంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# హాల్ టిక్కెట్లు నిరాకరించవద్దు

**తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించరాదు**

**నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు**

**జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**
ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయరాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఏ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలలలో అయినా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీకపోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హెూల్డ్ చేయకూడదని, ప్రభుత్వం గైడ్లైన్స్ ఇచ్చిందని, ఎవరైనా కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను హెూల్డ్ చేయడం చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై జరిగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేయడం జరుగుతుందని జీవో ఇవ్వడం జరిగిందని, కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లించడం జరుగుతుందన్నారు. ఏ కళాశాలలోనూ విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులు పెట్టరాదని సూచించారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా రాష్ట్ర ప్రభుత్వం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**
ఆపదలో ఉన్నవారికి తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. తన నియోజకవర్గంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న 30 మందికి రూ.38,78,482ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహంలో ఆయన అందించారు. (తరువాయి 4లో...)

# ఎన్సీసీ ద్వారా దేశ సేవకు సిద్ధం కండి

**సీఐ సుబ్బారావు**





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 24)**
విద్యార్థులు ఎన్సీసీ ద్వారా దేశ సేవకు సిద్ధం కావాలని మార్కాపురం సీఐ సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక కమల హై స్కూల్ నందు ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సీఐ పి సుబ్బారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పి పవన్ కుమార్, కమల హై స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, కమలా కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపి పుల్లయ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జెండా వందనం పట్టణ సిఐ సుబ్బారావు చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం ఎన్‌సిసి విద్యార్థులచే కవాతు నిర్వహించారు. సిఐ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎన్‌సిసిలో పాల్గొని తమ వంతు దేశ సేవ చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఎన్‌సిసి లో చేరాలని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ
(తరువాయి 4లో...)

# ఈ తల్లికి దిక్కెవరు

**మానవత్వం మరిచి కన్నతల్లిని వదిలి వేసిన కుటుంబ సభ్యులు**

**చలికి అల్లాడుతున్న మాతృమూర్తి**

**ఈ తల్లి చిరునామా ఎక్కడ...?**

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 24)**
ఓ కుటుంబం కన్నతల్లిని గాలికి వదిలేసిన సంఘటన యర్రగొండపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఆ వృద్ధ మహిళ ఎవరో తెలీదు.. రెండు రోజుల క్రితం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద గల ఆంజనేయస్వామి దేవాలయం ప్రక్కన ఓ వృద్ధ మహిళను గుర్తుతెలియని కుటుంబ సభ్యులు వదిలివెళ్లారు. నడవలేక వృద్ధాప్యంలో ఉన్న మాతృమూర్తిని ఎవరో గుర్తు తెలియని కుటుంబ సభ్యులు తమకు భారంగా తోచిందేమో తెలియదు కాని పోషించలేక మానవత్వం మరచి నిర్దయగా వదిలేసి వెళ్లారు. అప్పటి నుండి ఆ మాతృమూర్తి అన్నం లేక చలికి అవస్థలు పడుతుంది. ఆలయానికి వచ్చిన భక్తులు, బాటసారులు ఆమెకు ఆహారం అందిస్తున్నారు. వారు అందించిన ఆహారాన్ని కూడా ఆమె తినలేకపోతుంది. పైకి లేవడానికి నడుములు సహరించక ఎంత మాట్లాడినా మాట్లాడం లేదు. ఏమి మాట్లాడినా అర్థం చేసుకోలేక పోతుంది. తనది ఏ ప్రాంతమో, తనవారు ఎవరో కూడ చెప్పలేక పోతుంది. పాపం ఆ వృద్ధ మహిళ పడుతున్న బాధలు చూసిన, దారిన వెళ్తున్న వారు బాధ పడడం తప్ప ఏమి చేయలేక పోతున్నారు.





# చర్చి కమిటీ ఏర్పాటులో చెలరేగిన రచ్చ





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 24)**
కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలో 17వ తేదీ ఆదివారం ఆరాధన జరుగుతున్న సమయంలో పాత కమిటీ సభ్యులందరినీ మారుస్తున్నామంటూ కొందరు వ్యక్తులు ఆరాధన సమయంలో
(తరువాయి 4లో...)

# ఎన్సీసీ ద్వారా దేశ సేవకు సిద్ధం కండి

క్రమశిక్షణకు మారుపేరైన ఎన్సిసి గొప్పతనాన్ని గురించి తెలియ చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్ కమల కాన్సెప్ట్ ప్రిన్సిపాల్ పుల్లయ్య చే విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్సిసి ఎఎన్ఓ శ్రీకాంత్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రజనీష్, హరిలాల్ నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా రాష్ట్ర ప్రభుత్వం



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంచి మనసున్న గొప్ప మానవతావాది అని అన్నారు. 2014 - 19 కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదేవిధంగా ఆపదలో ఉన్న వారికి సి.ఎం.ఆర్.ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా కష్టాలలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి గతంలో మాదిరిగానే మానవతా దృక్పథంతో అండగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం పట్ల తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదని మంత్రి తెలిపారు. ఇలాంటి పేద కుటుంబాలన్నింటికీ పెద్ద మొత్తంలో హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పేదలందరికీ తమ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా అనారోగ్యంతో బాధపడుతున్న తమకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వచ్చేలా కృషిచేసిన మంత్రికి, మంజూరు చేసిన ముఖ్యమంత్రికి లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# చర్చి కమిటీ ఏర్పాటులో చెలరేగిన రచ్చ



చర్చిలోనికి ప్రవేశించి నూతన కమిటీ చైర్మన్‌గా ఎన్నిక చేసుకున్నట్టు ప్రకటించడంతో గొడవ మొదలైంది. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలతో చర్చలు జరిపారు కొన్ని రోజులు సమయం ఆగాలని కమిటీలకు సూచించారు. తిరిగి 24వ తేదీ ఆదివారం నూతన కమిటీ సభ్యులు కనిగిరి దుర్గం బ్యాటరీ చర్చ్ సంఘ కాపరి ప్రభు మనోహర్ దాస్ ఆరాధనకు రాలేదని ప్రకటించడంతో పాత కమిటీకి చెందిన సభ్యులు కొందరు సంఘ కాపరి ఎందుకు రాలేదంటూ ప్రశ్నించడంతో తిరిగి గొడవ ప్రారంభమైంది. అనంతరం గొడవ మొదలవడంతో కనిగిరి సీఐ, కనిగిరి, హెచ్ఎంపాడు ఎస్ఐలు దుర్గం బాప్టిస్ట్ చర్చిలోకి వచ్చి ఆరాధనలో జరుగుతున్న గొడవను ఆపాలని ఇరు వర్గాలను కోరారు. గొడవ తిరిగి ఎక్కువ కావడంతో పాత కొత్త కమిటీలు రెండు రద్దు చేయడం జరిగిందన్నారు. ఇరు వర్గాలు కూర్చుని చర్చించుకుని చర్చి సజావుగా జరిగే విధంగా చూడాలని ఇరువర్గాలను కోరినట్లు తెలిపారు. అనంతరం ఈ రచ్చ కనిగిరి పోలీస్ స్టేషన్‌కు చేరడంతో రెండు కమిటీలను రద్దు చేసి ఇరువర్గాల నుంచి అడహక్ కమిటీ సభ్యులుగా పది మందిని నియమించి వారి ద్వారా సంఘ కార్యకలాపాలను కొనసాగించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ ప్రభువు విశ్వాసులకు ఎంతో ప్రత్యేకమైన క్రిస్మస్ నెల ప్రారంభ సమయంలో ఈ విధంగా గొడవలు జరిగి చర్చి మూతపడటంతో పలువురు విశ్వాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ గొడవలు సద్దుమనిగి క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకునేలా చూడాలని ఆ ప్రభువుని వేడుకుంటున్నారు.

# ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాల మహోత్సవ వేడుక





ఈ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు....



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**

కొత్తపట్నం మండలంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్నటు వంటి నిస్వార్థ సేవలను గుర్తించి వారి సేవలకు గుర్తుగా వారిని అభినందిస్తూ వారి సేవలు స్మరించుకుంటూ వారిని సన్మానించుకోవడం కోసం ఆదివారం సాయంత్రం కొత్తపట్నం హై స్కూల్ లో కొత్తపట్నం మండల స్థాయి గురుపూజోత్సవ వేడుకలు 2024 ఘనంగా నిర్వహించారు. ఈ గురు పూజోత్సవ వేడుకలలో కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్, శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్, మండల ఉత్తమ ఉపాధ్యాయులు మొత్తం 105 మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించారు. అలాగే ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారంతో సత్కరించడం జరిగింది.

మండల స్థాయిలో ఎలిమెంటరీ సెక్షన్ నుండి అల్లూరు హరిజనవాడ ఎలిమెంటరీ స్కూల్ టీచర్ నిశానం విజయ కుమార్, హై స్కూల్ సెక్షన్ నుండి ఈతముక్కల జిల్లాపరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్ గోలి శివయ్య, కొత్తపట్నం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకొనగా, బీఎస్ఎం జిల్లా పరిషత్ స్కూల్ నుండి బయలాజీ టీచర్ కోడూరి ధన లక్ష్మి, శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఎలిమెంటరీ సెక్షన్ నుండి జయ క్రిస్టఫర్, హైస్కూలు సెక్షన్ నుండి ఫిజిక్స్ టీచర్ బి రమేష్ పాఠశాల, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ ఉత్తమ ఉపాధ్యాయులను నగదు బహుమతి, జ్ఞాపిక, సర్టిఫికేట్, దుశ్శాలువతో తో ఘనంగా సత్కరించారు. అలాగే ఈతముక్కల వీవర్స్ కాలనీ ఎలిమెంటరీ స్కూల్ టీచర్ శ్రీహరిరావు కొత్తపట్నం మండలంలో 30 సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి చేస్తున్న విశేష కృషికి ప్రత్యేక అభినందన పురస్కారం అందజేయడం జరిగింది. ఈ గురు పూజోత్సవ కార్యక్రమంలో తనకు చిన్నప్పుడు చదువు చెప్పిన చిన్ననాటి గురువులైన హై స్కూల్ టీచర్ చేపల చిరంజీవి, కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ ఎం శ్రీనివాసులు లను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించుకుని ఘనంగా సత్కరించారు. 'అందరూ చదవాలి - అందరూ ఎదగాలి' అనే ఉద్దేశంతో గ్రామంలో విద్యాభివృద్ధి కోసం 2015 నుండి వివిధ విద్యా సంబంధిత కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీరామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 9వ సంవత్సరం జరుగుతున్న ఈ గురుపూజోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమాని పూజ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

# గుత్తి త్యాగరాజుకు ఘన సత్కారం



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, నవంబర్ 24)

నెల్లూరు వేదగిరి లక్ష్మినరసింహ స్వామి దేవస్థానం కొండపై జరిగిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవ, సంఘం ఆవిర్భావ వార్షికోత్సవంలో ఇప్పటి వరకు చేనేత దేవాంగ సమాజంకు అందిస్తున్న సేవలను గుర్తించి కార్యక్రమంకు అతిధిగా ఆహ్వానించి వేద ఆశీర్వాదములతో సత్కరించి వరదయ్యపాలెంకు చెందిన గుత్తి త్యాగరాజుకు జ్ఞాపికను అందజేశారు. చేనేత, దేవాంగ సమాజమే కాక ఇతర సంస్థల ద్వారా యువత చైతన్య వంతమయ్యేలా చేస్తున్న కృషి ప్రశంసనీయం అని వక్తలు అన్నారు.గ్రామ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న దేవాంగ ఐక్యతకు కృషి చేస్తున్నారని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షులు డాక్టర్ మన్నెం సతీష్(డెంటిస్ట్), జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సజ్జ వెంకట సురేష్(ఏ డి ఇండస్ట్రీస్),ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సజ్జ సతీష్ కుమార్(ఆర్థోపిడిక్), గౌరవ అధ్యక్షులు జాగాబత్తిన శైలేష్, కోశాధికారి కొండా మాధవయ్య(ఏఈ), గౌరాబత్తిన శివకుమార్,హ్యాండ్ లూమ్ సొసైటీ కార్పొరేషన్ డాక్టర్ సజ్జ హేమలత,మాజీ దేవాంగ కార్పొరేషన్ బీరక సురేంద్ర బాబు,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు కోటం రెడ్డి గిరిధర్ రెడ్డి, డైరెక్టర్ తాళ్ల నరసింహ స్వామి,దేవాంగ టీడీపీ సోషల్ మీడియా ఇంచార్జి చప్పరం మల్లికార్జున రావు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నెముద్దు శ్రీనివాసులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాప కుమారస్వామి, వస్తుకవి పెరిశెట్ల శివ కుమార్,పులి సురేష్,తదితర ప్రముఖులు పాల్గొన్నారు.నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ

# మానసిక దివ్యాంగులకు చలి కోట్లు పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 24)**

పట్టణంలోని కొత్తపల్లెరోడ్‌లో ఉన్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలనందు మానసిక దివ్యాంగులకు కొమరోలుకు చెందిన కేపీ గురయ్య శ్రీ శ్రీ వీరబ్రహేంద్ర స్వామి డిగ్రీ కాలేజి వ్యవస్థాపకులు చలిని దృష్టిలో పెట్టుకొని సలికోట్లు శనివారము రాత్రి పంపిణి చేశారు. దాత కేపీ గురుయ్యకు ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యస్ అభిబ్ ఖాన్, ఆర్ట్ ఆఫ లివింగ్ యోగా టీచర్ బీయస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# స్వాములకు అన్నప్రసాద వితరణ

## సున్ని అంజుమన్ కమిటీ చైర్మన్ దూదేకుల హజరత్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**

సున్ని అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు మాలధారణ స్వాములకు అన్నప్రసాద కార్యక్రమము కులమతా లకు అతీతంగా ఈ కార్యక్రమము చేస్తుంన్నము. అని కమిటి చైర్మన్ దూదేకుల హజరత్ ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మలదరణ వేసుకున్న గురు స్వాములు దూదేకుల హజరత్‌కు సన్మానం చేసి అన్నప్రసాద కార్యక్రమన్ని మొదలు పెట్టారు.కార్యక్రంలో లో ముఖ్య అతిథిగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియమైన శిష్యుడు సిద్దయ్య స్వామి వారి 9వ తరం మనవడు కలగట్ల సిద్ధ యోగి స్వామి, సున్ని అంజుమన్ కమిటి చైర్మన్ దూదేకుల హజరత్, గౌరవ సలహాదారులు జమాల్ , కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు , ప్రభుత్వ తాలూకా ఖాజీ షేక్ నాయబ్ రసూల్,కార్యదర్శి కౌలూరి పెద్ద కాశన్న, గిద్దలూరు కమిటీ అధ్యక్షులు దూదేకుల నాయబ్ కాజా, ఖాసిం వలి, నాగేంద్ర, సిద్దయ్య, ఓబులేసు, సిద్దయ్య పెద్ద, ముల్లపాడు కాసిం పీరా, మాల ధారణ గురువులు, మాలధారణ వేస్తున్న స్వాములు, తదితరులు పాల్గొన్నారు.


# పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 24)**

పట్టణంలోని ఎస్ఎస్ ప్లాజాలో పట్టణానికి చెందిన గందె కార్తీక్, అఖిల కుమారుడు హరి శంకర్ చేతన్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఆధివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని కేక్ కట్ చేయించి చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి సత్కారం



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 24)**

పీఏసీ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ముండ్లపాడు టిడిపి నేతలు ఆదివారం గిద్దలూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బొమ్మినేని వెంకటేశ్వర్లు, మండ్లా రంగ నాయకులు, శివపురం మురళీ కృష్ణ, శివపురం కిరణ్‌లు కలిసి అభిందించారు.

## గ్రంథాలయంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 24)** మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పాలకుడు డి. ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత వివిధ రకాల నీతి కథల పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులలో మంచి భావనలు నాలెడ్జ్ తిరుగుతుందని విద్యార్థులను తల్లిదండ్రులు గ్రంథాలయాన్ని పంపించడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ పాలకుడు డి .కోటేశ్వరరావు తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థుల చేత క్యారమ్స్ ఆడించడం జరిగింది. అదేవిధంగా ఉలవపాడు గ్రంథాలయానికి అనుసంధాన మైనటువంటి చాకిచెర్ల గ్రంథాలయంలో లైబ్రరీ యన్ రాణమ్మ ఆధ్వర్యంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

## గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

### ముఖ్య అతిథిగా మండల జడ్పిటిసి చేవూరు అరుణ







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 24)**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అయ్యప్ప గుడి గుర్రం బాబయ్య కళ్యాణ మండపంలో ఆదివారం నెల్లూరు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో హాస్టల్స్ మరియు గురుకులంలోని 570 మంది విద్యార్థులులకు గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిర్సా ముండా గారి జీవిత చరిత్ర వ్యాసరచన పోటిలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా మా గిరిజన ఆడపడుచు నెల్లూరు నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి జై వర్ధన్ , ఉలవపాడు మండల జడ్పిటిసి చేవూరు అరుణ మా గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మేయర్ స్రవంతి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఇంత భారీ మొత్తంలో హాజరవ్వటం నేను మొదటిసారిగా చూస్తున్నాను, కాబట్టి ఇదే స్ఫూర్తితో ప్రతి కాంపిటీషన్ పరీక్షల్లో మన గిరిజన విద్యార్థులు పాల్గొని మనమంటే ఇది స్ఫూర్తిని చాటాలని విద్యార్థులకు సూచనలు ఇవ్వడం జరిగింది.

## జర్నలిస్టు నారాయణను పరామర్శించిన కావలి ఎమ్మెల్యే



**(షణ్ముఖ వెలుగు, కావలి, నవంబర్ 24)**

కావలి పట్టణానికి చెందిన జర్నలిస్ట్ బొగ్గవరపు నారాయణ శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కావలి పట్టణంలోని రామస్వామి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి , ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి నారాయణను పరామర్శించారు. డాక్టర్లను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యుల సూచనలు పాటించి త్వరగా కోలుకోవాలని నారాయణకు తెలిపారు.

# సామాజిక సేవా రంగాల్లో కమ్మవారి సేవా సంఘం సేవలు ప్రశంసనీయం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు
కమ్మవారి సేవా సంఘం కార్తీక వనభోజన కార్యక్రమంలో
పాల్గొన్న కమ్మ ప్రముఖులు

















**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**

సొంత కులాన్ని ప్రేమిస్తూ ఇతర కులాలను గౌరవించడమే కమ్మ కుల ఔదార్యం అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడు గ్రామపంచాయతీలోని హైవే గ్రోత్ సిటీలో జరిగిన ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం కార్తిక వన భోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రకాశం జిల్లా కమ్మ వారిసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. కమ్మ వారి కార్తీక వనభోజన కార్యక్రమాన్ని పురస్కరించుకొని కమ్మవారి సేవా సంఘం ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దామచర్ల ఆవిష్కరించారు. కమ్మవారి సేవా సంఘం కార్తిక వనభోజన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున కమ్మ బంధువులు వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు విద్యా వ్యాపార రాజకీయ ప్రముఖులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ కమ్మ కులం ఇతర కులాలను గౌరవిస్తూ వ్యాపార విద్య రాజకీయ రంగాలలో అందరినీ కలుపుకుంటూ ఎదిగిన కులం అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నుండి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది కమ్మ ప్రముఖులు అంచలంచలుగా ఎదిగిన వారేనని అన్నారు. కమ్మ కుల అభివృద్ధికి పాటుపడుతూ ఇతర కులాలైన బడుగు బలహీన వర్గాలకులాల కు కూడా సహాయపడుతూ వారి ఎదుగుదలకు మన వంతు ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన ఆకాంక్షించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ కమ్మ కులం లో పుట్టిన ఎంతో మంది ప్రముఖులు చరిత్రలో సృష్టించారని వారి చరిత్రను భావితరాలు స్మరించుకోవాలని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు,మరో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కమ్మవారి సేవా సంఘానికి తన వంతు సహాయం ఎప్పుడూ అందజేస్తానని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు చిడి డిపోతు వెంకటేశ్వర్లు కోటి రూపాయల విలువైన స్థలాన్ని సంఘ భవనానికి విరాళంగా అందజేశారు. నంద్యాల కమ్మ నాయకులు సంఘ నాయకులు అభిరుచి మధుసూదనరావు నేషనల్ హైవే ప్రక్కనే సంఘ భవనానికి ఒక ఎకరం స్థలాన్ని ఇస్తానని ప్రకటించారు. అనేకమంది కమ్మ ప్రముఖులు హాజరై ఆత్మీయ సందేశం అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లు డాక్టర్ బి సి హెచ్ గరటయ్య, గుండపనేని అచ్యుత్ కుమార్, చుండూరి రవిబాబు,రాజమండ్రి జిఎస్సాఎల్ విద్యాసంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావు, రచయిత కోటా పురుషోత్తం, క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమనూరు నాగేశ్వరరావు,హర్షిని విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్,ప్రతిభ విద్యాసంస్థల డైరెక్టర్ నల్లూరి జయప్రకాష్ తో పాటు కమ్మవారి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కమిటీ సభ్యులు కాట్రగడ్డ రఘుపతిరావు, పావులూరి బాపయ్య చౌదరి, అబ్బూరి నవీన్, నాగు బోయిన భాస్కరరావు, గార్లపాటి శ్రీనివాసరావు, కంచర్ల వెంకట నారాయణ, దుగ్గినేని వెంకట్రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వడ్డెమ్ పూడి సుజాత, జిల్లా అధికార ప్రతినిధి రావుల పద్మజ, యోజన విభాగం అధ్యక్షులు బొడపాటి వెంకట్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి సభ నిర్వా హకులుగా ఓరుగంటి వెంకటేశ్వరరావు, మండవ సుబ్బారావులు వ్యవహరించారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవటం మా కిష్టం కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)** జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు ఆదివారం చదవటం మా కిష్టం కార్యక్రమం ఉదయం 10 నుండి 12 గంటల వరకు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ముందుగా పిల్లలతో పుస్తక పఠనం చేయించడం జరిగింది. అనంతరం ఆదివారం కార్యక్రమంనకు ఫ్యాకల్టీలుగా వచ్చిన జాలాది మోహన్ (వ్యక్తిత్వ వికాసకులు, ఉపాధ్యాయులు, కవి, రచయిత మరియు సోషల్ వర్కర్ వారు పిల్లలకు మోటివేషన్ కథలు చెప్పి, పిల్లలతో సొంతంగా కథలు చెప్పించటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వలన మంచి భావనలు నాలెడ్జ్ పెరుగుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను గ్రంథాలయాలను సందర్శించే విధంగా ప్రోత్సహించి ప్రతిరోజు కొంత సమయం గ్రంథాలయంనకు వచ్చి పుస్తకాలు చదివేలా కృషి చేస్తే వారు ఉత్తమ విలువలు గల పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు అవుతారని సమాజంలో ఇలా జీవించాలో నేర్పేవి గ్రంధాలయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె సంపూర్ణమ్మ, డి సందీప్, పి ఇమ్మానుయేలు, పాఠకులు పాల్గొన్నారు.

## గాంధీ పార్క్ తొలగించేందుకు రంగం సిద్ధం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 24)** పశ్చిమ ప్రకాశం ముఖ ద్వారమైన మార్కాపురం పట్టణ నడిబొడ్డున 1957లో ప్రారంభించిన గాంధీ పార్క్ తొలగింపుకు మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే పార్క్ చుట్టూ ఉన్న ఆక్రమనలను తొలగించిన అధికారులు పార్కును తొలగించేది కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే పార్కును అభివృద్ధి చేసి పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ పార్కును తొలగించవద్దని మున్సిపల్ అధికారులను కోరారు. అవసరమైన మేర స్థలాన్ని తీసుకొని మిగతాది పార్క్‌కు ఇచ్చినట్లయితే మళ్లీ అభివృద్ధి చేస్తానని, ప్రజలకు కాస్తంత ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. అయితే అధికారులు మాత్రం పార్కు తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, నవంబర్ 24)**

అద్దంకి పట్టణంలోని శ్రీ ధన్వంతరి దత్తుపాదుక క్షేత్రంలో మంత్రి గొట్టిపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా 150 రోజులు పూర్తి చేసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నాం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు,పేదవారికి అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించామన్నారు. రూ. 800 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా గుంతల రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామని,దివ్యాంగుల ఫించన్ ను ఒకేసారి రెట్టింపు చేయడం జరిగిందన్నారు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని రెండు నెలలపాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయినా మూడో నెలలో ఒకేసారి మొత్తం చెల్లించేలా నిర్ణయం తీసుకుందన్నారు,పెన్షన్ తీసుకుంటున్న కుటుంబ యజమాని మరణిస్తే..భార్యకు మరుసటి నెలలో వితంతు పెన్షన్ మంజూరు అయ్యేలా ఉత్తర్వులు ఇచ్చి పేదలకు అందుబాటులో ఉంటున్న ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నేతలు తదితరులు పాల్గొన్నారు.



# పొదిలిలో ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం






(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 24)

రాష్ట్రంలో అత్యాధునిక గుండె, మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను గత 36 సంవత్సరాల నుండి అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, సూపర్ స్పెషాలిటీ క్లీనిక్‌ను పట్టణంలోని దర్శి రోడ్, రథం సెంటర్ దగ్గరలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందని దూర ప్రాంతాల్లో ఉన్న పట్టణాలలో కూడా వైద్య సేవలు అందించేందుకు గాను పొదిలి పట్టణంలో ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ను ఆధునిక వైద్య పరికరాలతో ప్రారంభిస్తున్నామని ఈ సెంటర్ నందు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్,ఒంగోలు విభాగం నుంచి వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్.నల్లూరి నితిన్ మాట్లాడుతూ త్వరలో ప్రకాశం జిల్లాలోని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందని మారుమూల ప్రాంతాలకు కూడా స్పెషాలిటీ క్లినిక్స్ ను అందుబాటులోనికి తీసుకు వస్తామని తెలిపారు. గ్రూప్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్.కార్తీక్ చౌదరి మాట్లాడుతూ ఒంగోలు సెంటర్ ఆవరణలోనే త్వరలో మరొక 100 పడకలతో అన్ని రకముల ఎకానమీ వైద్య సేవలను అందరకీ అందుబాటులో తీసుకు వస్తున్నామని పొదిలి లో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్య సర్వీసులను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య సంరక్షణార్థం ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహించారు.

ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్, షుగర్ అండ్ థైరాయిడ్ వైద్య నిపుణులు డాక్టర్ భారతి, జీర్ణకోశ శస్త్ర చికిత్స వైద్యనిపుణులు డాక్టర్ యు శ్రీనివాసులు, స్త్రీ ప్రసూతి, ఇన్ఫెర్టిలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రతిమ, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియాంక, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎండి జహంగీర్ సుల్తాన్, చర్మ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ శ్యామ సుందరి, తదితరులు పాల్గొని 200 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.

## జాతీయ స్థాయి ప్రముఖుల పురస్కార ప్రధానోత్సవం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)

కళా మిత్రమండలి (తెలుగు లోగిలి) 18 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రమందు జాతీయస్థాయిలో సాహిత్య, సంగీత, రంగస్థల నృత్య కళారంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్య అతిధులు విచ్చేసి ఆయన చేతులు మీదుగా పురస్కారంలు అందజేయడమైనది. పురస్కారంలు ప్రముఖ కవి,సాహితీవేత్త శివారెడ్డి , చిత్రకవితా పరిశోధకులు అలంకారం వెంకటరమణ రాజు, రంగస్థల నటులు శ్రీదామవరపు మునలయ్య, బాల నర్తకి చి.బొప్పరాజు రాజశ్రీ తదితరులకు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని కళా మిత్రమండలి అధ్యక్షుడు నూనే అంకమ్మ రావు సభా కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగు లోగిలి అవార్డు కమిటీ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధులు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, కళా మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

## అత్తివరం, ముమ్మాయిపాలెం పంచాయతీల నుంచి టిడిపిలోకి భారీగా చేరికలు



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, నవంబర్ 24)

సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ్ జిల్లా టిడిపి అధ్యక్షులు నరసింహా యాదవ్ సమక్షంలో నాయుడుపేట టిడిపి కార్యాలయంలో ఆదివారం తిరుపతి జిల్లా అత్తివరం గ్రామానికి చెందిన పాల్చూరు పెద్ద చెంగయ్య యాదవ్, చిన్న చెంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో అత్తివరం, కారూరు గ్రామాల నుండి టిడిపిలోకి భారీ సంఖ్యలో చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే ముమ్మాయిపాలెం గ్రామం నుండి సర్పంచ్ శంకు సుజాత, మహేంద్ర,ఎన్. నాగభూషణం, పి. విశ్వనాథ్, పి. నాగార్జున, పి. గోవర్ధన్, ఇంకా పలువురుకి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జిల్లా బీసీ సెల్ నాయకులు పాడి వెంకటసుబ్బయ్య, యువ నాయకులు కాటూరి కోటేశ్వరరావు, సూరి రెడ్డి, చంద్రమోహన్, కార్తీక్ రాజు, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారి సత్రం మండలాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం వనభోజనాల కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా



(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, నవంబర్ 24)

మండల ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వనభోజనాలు కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘురావు రావు, సతీమణి శిద్దా లక్ష్మి పద్మావతి పాల్గొన్నారు. దర్శి పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీకమాస వనసమారాధన






కార్యక్రమంలో పాల్గొని ముందుగా పులిపాడు శివాలయం గుడిలో పూజలు నిర్వహించి, అనంతరం అర్ధనారీశ్వరుడి దగ్గర కార్తీకమాస దీపాలు వెలిగించిన తరువాత కార్యక్రమ సభలో ఆర్యవైశ్య సభ్యులు అందరూ ఒక తాటి పైకి రావాలి అని ప్రసంగించారు. అనంతరం ఆర్యవైశ్య నూతన అధ్యక్షుడిగా భూమా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఇరుమూరి రాము, కోశాధికారిగా కొత్తమాసు సాయి కుమార్‌ని నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల ఆర్యవైశ్యులు భారీగా పాల్గొని శిద్దా రాఘవరావు, సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతిలను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు.

## 26న అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం అధికారికంగా జరపాలి

### జిల్లా కలెక్టర్ అన్ని శాఖలకు అదేశాలివ్వాలి

### దళిత నేత నీలం నాగేంద్రం డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)

ఈ నెల 26వ తేదీ అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం ప్రభుత్వం అధికారికంగా జరపాలని ప్రభుత్వాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రం డిమాండ్ చేసారు. ఆదివారం తన కార్యాలయంలో నీలం నాగేంద్రం విలేకరుల తో మాట్లాడారు. సరిగ్గా 75 సంవత్సరాల క్రితం 1949 నవంబర్ 26 న అంబేద్కర్ రాజ్యాంగాన్ని అప్పటి భారత ప్రభుత్వం ఆమోదించిందన్నారు.బ్రిటిష్ పాలనలో 200ల ఏళ్ళు బానిస బతుకులు బతికిన భారత దేశాన్ని పరిపాలించటానికి అంబేద్కర్ రాజ్యాంగం తప్పనిసరి అయ్యిందన్నారు. ఆనాటి ప్రధాని నెహ్రూ సర్దార్ వల్లభాయ్ పటేల్,మౌలానా ఆజాద్ లాంటి వారికి అంబేద్కర్ తన రాజ్యాంగం ముసయిదా అందించారన్నారు. 2సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లో అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని పూర్తిచేసారన్నారు. ఈ అంబేద్కర్ రాజ్యాంగ ఆమోదించిన 2 నెలలకు అంటే జనవరి 26, 1950వ సంవత్సరం అమల్లోకి వచ్చిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజును రిపబ్లిక్ డే లేదా భారత గణతంత్ర దినోత్సవం గా భారత దేశ ప్రభుత్వం దేశమంతా ఉత్సవాలు జరుపుతుందన్నారు. 2016 లో మొట్టమొదటిసారిగా మోడీ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని గుర్తించి దేశ వ్యాప్తంగా జరుగుతుంధన్నారు. కావున కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నవంబర్ 26 తేదీన 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.కేంద్రప్రభుత్వం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ద్వారా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈవిషయం పై అదేశాలు జారీ చేసిందన్నారు. ఈరోజు పార్లమెంట్ భావనంలో ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన ప్రతిపక్ష నేతలతో కలిసి రాజ్యాంగ ఆమోద దినోత్సవ నిర్వహణ పై సమావేశం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అదేశాలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు అంబేద్కర్ పట్ల వివక్షతో ఆదమరిచి ముందు రోజే మెలుకున్నట్టు నటిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఈనెల 26న అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని నీలం నాగేంద్రం డిమాండ్ చేసారు.

## జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఎన్సీసీ డే





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 24)

స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్సిసి వింగ్ 186 సీవోఐ ఆధ్వర్యంలో నవంబర్ 24 ఎన్సిసి దినోత్సవము వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు డీన్ డాక్టర్ మస్తా నయ్య సిఎస్సి విభాగం అధిపతి డాక్టర్ సాధు నాయక్ ఎన్‌సిసి ఫ్లాగ్‌ను ఆవిష్కరించి, అనంతరం ఎన్‌సిసి క్యాడెట్‌ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి పరేడ్ నిర్వహించారు. ఎన్‌సిసి ఏఎన్‌ఓ, కెప్టెన్ అనిల్ నేతృత్రంలో ఎన్సిసి 34 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు వివిధ రకాలైన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యపకేతర సిబ్బందితోపాటు ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కంకణం కట్టుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 24)

మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కంకణం కట్టుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి కోరారు. ఆదివారం సిపిఎం మార్కాపురం మండల మహాసభ స్థానిక ఎన్జీ హెూమ్ లో తురక ఏడుకొండల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభల్లో పాల్గొన్న కామ్రేడ్ జీవి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రధానమైన సమస్యలను పరిష్కారం కోరుతూ ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని తెలిపారు. రాయవరం పరిధిలో ఉన్నటువంటి మెడికల్ కాలేజీని వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వమే నిర్వహించాలని, వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి గొట్టపడే గ్రామ నిర్వాసితుల సమస్యల పరిష్కారం చేయాలనే డిమాండ్ చేశారు. మార్కాపురం పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి లిఫ్ట్ ఇరిగేషన్ను పూర్తి చేసి రైతులకు మేలు అందించాలని, పలకల కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా పలకల క్వారీల్లో పనిచేసే కార్మికులను అందర్నీ ప్రభుత్వమే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి అన్ని గ్రామాలకు సాగర మంచినీళ్లు సరఫరా చేయాలని, మండల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.గొర్రెల మేకల పెంపకం దారులకు ప్రభుత్వము జీవో నెంబర్ 559, 1016 ప్రకారం ప్రభుత్వ భూమిని సొసైటీలకు కేటాయించని వారు డిమాండ్ చేశారు ఈ మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుబాటి సోమయ్య, పార్టీ జిల్లా కమిటీ నాయకులు డీకేఎం రఫీ, మండల నాయకులు జి రాజశేఖర్ రెడ్డి, ఎం బాల శేషయ్య, జె నాగరాజు, తిరుపతయ్య, జె నాగయ్య, పి లక్ష్మయ్య, పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఏవై 2.0 రిజిస్ట్రేషన్ చేసుకోగలరు

### సొంత గృహ నిర్మాణానికి ఆసక్తి కలిగిన అర్హులందరికీ మంత్రి ఆనం విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 24)

సొంత గృహ నిర్మాణం కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీఎంఏవై స్కీమ్ ద్వారా నూతన గృహ నిర్మాణంకు ఆసక్తి కలిగిన అర్హులందరూ.. మీ మీ బయోమెట్రిక్ ఆధార్‌లో అప్డేట్ చేసి .. అవసరం అయిన డాక్యుమెంట్ జెరాక్స్ కాపీలను అందచేసి ఈ నెల 26వ తేది లోగా మీ మీ గ్రామ సచివాలయం పరిధిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవలసినదిగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చేయడానికి రేషన్ కార్డు, పాన్ కార్డ్, ఆదాయ ధృవీకరణ పత్రం, జీవిత భాగస్వామి పేరు, జీవిత భాగస్వామి అధార్, ప్రస్తుత చిరునామా, ప్రతిపాదిత సభ చిరునామా, బ్యాంక్ వివరాలు, లబ్ధిదారుని సంతకం, బొటనవేలు ముద్ర, మతం, కులం, ఉపకులం, లబ్ధిదారుని తల్లి, తండ్రి పూర్తి వివరాలు తీసుకురావాలని సూచించారు.

# ఘనంగా కళామిత్రమండలి 18వ వార్షికోత్సవ వేడుకలు

## జాతీయ స్థాయి పురస్కారాల ప్రధానోత్సవం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**

కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ సంస్థ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం( 24వ తేదీన) ప్రకాశం జిల్లా ఒంగోలులోని యన్.టి.ఆర్ కళాక్షేత్రం నందు జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు సభా నిర్వహణ చేయగా, కళామిత్ర మండలి అవార్డ్స్ కమిటీ ఛైర్ పర్సన్ మరియు నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత పదిహేడు సంవత్సరాల నుండి కళామిత్ర మండలి ద్వారా ఇస్తున్న పురస్కారాలను గురించి, వివిధ సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు గురించి సవివరంగా,చక్కగా వివరించారు. .ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ముఖ్య అతిథిగా హాజరై, ప్రముఖ కవి, రచయిత, ముఖ్య వక్తగా పాల్గొన్న కె.శివారెడ్డికి "శ్రీమతి నూనె వెంకాయమ్మ -వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని "ప్రదానం చేశారు . అలాగే కళామిత్ర మండలి ఇస్తున్న మరో పదిమందికి జాతీయ స్థాయి పురస్కారాలను వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రముఖ సాహితీవేత్తలు, కవులకు ప్రదానం చేశారు.ఈసందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించటం చాలా గొప్ప విషయమని, తెలుగు భాష పరిరక్షణకు అందరూ తమవంతు కృషి చేయాలని , తెలుగు భాషను సుసంపన్నం చేస్తున్న కవులను ,రచయితలను, సాహితీమూర్తులను ఒంగోలుకు ఆహ్వానించి ఇలా అవార్డులతో సత్కరించటం ఎంతో గొప్ప విషయమని ప్రశంసించారు.జీవన సాఫల్య పురస్కార గ్రహీత, ముఖ్య వక్త శివారెడ్డి మాట్లాడుతూ సంచారి కానివాడు కవి కాలేడు అని భావించి తెలుగు నేలంతా పర్యటించానని,83 ఏళ్ళ వయసులో ఇంకా విద్యాబోధన చేస్తున్నానని,కవి అనేవాడికి ఒక సామాజిక బాధ్యత ఉంటుందని,ఒడ్డున కూచున్న వాడికంటే మేడిపెట్టి పొలంలో దిగేవాడే ఘనుడని అని చెబుతూ కవిత్వం నాకు ప్రాణం,అది నన్ను నడిపించే శక్తి అని తెలిపారు. ఈ సభలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు,ప్రముఖ సాహితీపోషకులు వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) ,కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు,జి.వి. పూర్ణచందు,నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ,ప్రముఖ సాహితీవేత్త ,కళారత్న డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు,ప్రముఖ కవి శ్రీ గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.ధాత్రికుమారి, బిట్స్ విద్యా సంస్థలు చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి,గౌరవ అతిథులుగా కుర్రా ప్రసాద్ బాబు, మిడసలమల్లికార్జునరావు ,డా.సంతవేలూరి కోటేశ్వరరావు,నూకతోటి శరత్ బాబు , తదితరులు పాల్గొని ప్రసంగిస్తూ అందరూ అంకమ్మరావు చేస్తున్న కృషిని కొనియాడారు.సంస్థ కార్యదర్శి శ్రీమతి సింహాద్రి జ్యోతిర్మయి ప్రతి సంవత్సరం కళామిత్రమండలి సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలను గురించి సంక్షిప్తంగా వివరించారు. జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్న గ్రహీతల వివరాలను ఇలా వరుసగా వివరించారు. "డాక్టర్ నాగభైరవ , మండవ నరసింహారావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం " కాకుమాను శివప్రసాద్, పంజాబ్ ,"శ్రీ కొంపల్లి బాలకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం " డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, హైదరాబాద్ ", సింహాద్రి విశాలాక్షి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం "డాక్టర్ డి.పార్వతిదేవి, కర్నూలు," భూసురపల్లి సుబ్బరత్నం - ఆదిశేషయ్య స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" పాలపర్తి జ్యోతిష్మతి, అద్దంకి , ' కరణం జ్ఞానేశ్వరి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" డాక్టర్ వి.రఘుపతి, చిత్తూరు ,' తన్నీరు కోటయ్య స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం "డాక్టర్ బూసి వెంకట స్వామి, విశాఖపట్నం, " సీతాదేవి- నాగేశ్వరరావు స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" వంగర శ్రీధర్, చీరాల, డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం"కోటి రామమోహన్ రావు, చిలకలూరిపేట, కొలకలూరి స్వరూపరాణి స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం" ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, గుంటూరు, మేకల జయరామిరెడ్డి స్మారక క్రీడారత్న పురస్కారం"యం.వి.ఎస్. ఎస్.ప్రసాద్, కాకినాడ తదితరులుతోపాటు కళామిత్ర రాష్ట్ర స్థాయి పురస్కారాలను అలంకారం వేంకటరమణరాజు, దామవరపు ముసలయ్య, బాల నర్తకి బొప్పరాజు రాజశ్రీకి, కవయిత్రి యన్ నాంచారమ్మలకు ప్రదానం చేశారు. సభకు ముందు చందు డాన్స్ అకాడమీ విద్యార్థుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ సభలో పురస్కార ప్రదాతలు మండువ పద్మలత, మండువ కమలా సుభాష్ లు ,కొలకలూరి విద్యాధర్, చక్రవర్తి, వి.ఝాన్సీ దుర్గ, మహతి తన్నీరు బాలాజీ, శ్రీమతి వంకాయల పాటి జయలక్ష్మి, మేకల సీతారామిరెడ్డి, శ్రీమతి కరణం విమల మరియు ఇంకా ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల బాలకోటయ్య,ఓరుగంటి ప్రసాద్, జి.వి.శేషగిరి,బీరం అరుణ, అలంకారం విజయ్ కుమార్, పరాంకుశం కృష్ణవేణి తదితరులు పాల్గొని నిర్వహణ సహకారం అందించారు.

# కాపు బలిజ వన భోజన కార్యక్రమాల్లో ఆకుపాటి



**(షణ్ముఖ వెలుగు, పామూరు, నవంబర్ 24)**

కనిగిరి మండల పరిధిలోని నందన మారెళ్ళ శ్రీ కృష్ణదేవరాయల కాపు బలిజ కార్తీక వన భోజనాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా భగవద్గీత పుస్తకాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాపు బలిజ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కన్నీరు పెట్టిస్తున్న వెల్లుల్లి ధరలు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 24)**

నెల్లూరు జిల్లాలో వెల్లుల్లి ధరలు ఆకాశమే హద్దుగా పరుగులు తీస్తున్నాయి. కిలో 350 నుండి రూ.400 పై ధర పలుకుతుండడంతో ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో వెల్లుల్లి దిగుబతులు భారీగా తగ్గిపోవడంతో రేట్లు పెరిగే అని వ్యాపారస్తులు అంటున్నారు. మొన్నటి వరకు కన్నీరు పెట్టించిన ఉల్లి కొరత కొంతవరకు ప్రజలకు ఉపయోగపడిన వెల్లుల్లి రేట్లు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెల్లుల్లి రేట్లు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

# మార్కండేశ్వర ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 24)**

మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర ఆలయం నందు గల శ్రీ శ్రీ జగద్గురు ఆదిశంకరచార్య దశబ్ది మహోత్సవ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారి పూజా కార్యక్రమాలలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వక్కలగడ్డ మల్లికార్జున, టిడిపి సీనియర్ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, ఆలయ ఈవో, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలినేనివి దిగజారుడు రాజకీయాలు

### ఎమ్మెల్సీ పదవి కోసమే జగన్‌పై విమర్శలు
### జగన్ పాలనలో కారు చౌకగా విద్యుత్తు కొనుగోలు
### రాజకీయ భిక్ష పెట్టిన కుటుంబంపైనే బాలినేని విమర్శలా
### మీడియా సమావేశంలో వైసిపి
### ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫైర్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)**

తన స్వార్ధ రాజకీయాల కోసం బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంతగా దిగజారుతారని తాను కలలో కూడా ఊహించలేదని వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒంగోలులోని జిల్లా వైసీపీ కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ స్వార్ధ ప్రయోజనాల కోసం మాజీ మంత్రి బాలినేని దిగజారి మాట్లాడుతున్నారన్నారు. జగన్ పై నిందలు వేయటం ద్వారా రాజకీయంగా లబ్ది పొంది ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారని అన్నారు. దేశంలోనే కారు చౌకగా విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకున్న వ్యక్తి జగనన్నాడు. జగన్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చారిత్రాత్మకమైనదన్నారు. జగన్ కన్నా రెట్టింపు ఖర్చుపెట్టి చంద్రబాబు నాయుడు విద్యుత్తును కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ యూనిట్ విద్యుత్ ను రూ. 2.48 లకు కొనుగోలు చేస్తే చంద్రబాబు నాయుడు మాత్రం యూనిట్ విద్యుత్తును రూ. 4.50 లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. తనకు తెలియకుండానే విద్యుత్ ఒప్పందంపై నాటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సంతకాలు చేశానని చెప్పడం దుర్మార్గమన్నారు. ఎవరి నిప్పు కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని ప్రజలకు చెప్పాలన్నారు. బాలినేనికి రాజకీయ బిక్ష పెట్టింది వైయస్సార్ కుటుంబం అన్నారు. అటువంటి కుటుంబాన్ని నిందలపాలు చేసేందుకు బాలినేని విమర్శలు చేయటం సబబు కాదన్నారు. జగన్ ప్రభుత్వంలో తనకు స్వేచ్ఛ లేదని బాలినేని పేర్కొవటం విడ్డూరంగా ఉందన్నారు.ఇతర పార్టీల రాజకీయ నాయకులతో స్పెషల్ ఫ్లైట్లో విదేశాలకు వెళ్లగలిగే స్వేచ్ఛ ఇచ్చింది జగన్ ప్రభుత్వం అన్నారు. ఇటువంటి ఆధారాలు లేకుండా జగన్ పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.పార్టీ కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో వైసిపి ఒంగోలు నియోజక వర్గం అధ్యక్షులు చుండూరి రవిబాబు, ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, కె.వి ప్రసాద్, అంజిరెడ్డి, బోట్ల సుబ్బారావు, కుట్టు బోయిన కోటి యాదవ్, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యాదవుల కార్తీక మాస వన సమారాధన

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 24)**



పల్నాడులోని యాదవ సోదరులందరూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అందుకోసం చదువు ఒకటే సరైన మార్గమని టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎల్సికే సిమెంట్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న ఆవరణలో జరిగిన ఏడవ యాదవ కార్తిక వన సమారాధన కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ యాదవులందరూ ఐక్యంగా ఉండి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైజాగ్ 2 శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఆర్థికంగా బలపడాలని అప్పుడు మాత్రమే వారు సమాజంలో నిజమైన గుర్తింపు పొందగలరని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ యాదవులు తమలోతాము తగువులు పెట్టుకోకుండా తమ లక్ష్యం అయినటువంటి అభివృద్ధి విద్య వ్యాపారాల వైపు దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా బండారు రామకృష్ణ యాదవ్, తాళ్ల వెంకటేష్ యాదవ్, స్థానిక నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, వై నాగరాజు, రామకృష్ణారావు, జీవీ యాదవ్ జింకల నాగేశ్వరరావు, కె నాగరాజు గుండాల శ్రీనివాస్ యాదవ్, మున్న రాంబాబు, జల్లెల కొండలు, సురేష్, సింగు నాగేశ్వరరావు, సాంబశివరావు, తదితర యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### అసిస్టెంట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపర్డెంట్ పిఎస్ ఊహ సిరి





**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, నవంబర్ 24)**

రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం మద్యం షాపుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలని అసిస్టెంట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపర్డెంట్ పి ఎస్: ఊహ సిరి అన్నారు. ఆదివారం సూళ్లూరుపేట సెక్షన్ పరిధిలోని తడ దొరవారిసత్రం మద్యం దుకాణాలలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. మద్యం షాపు నుంచి బయట బెల్ట్ షాపులకు మద్యం వెళ్ళకూడదని మరియు ఒక వ్యక్తికి మూడు బాటల్స్ మించి ఇవ్వకూడదని, మద్యం ను ఎమ్మార్పీ రేట్లు కంటే పెంచి అమ్మకూడదని తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్(మహిళా) కళాశాలలో అవగాహన కార్యక్రమం సూళ్లూరుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల నందు అసిస్టెంట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపర్డెంట్ పి ఎస్: ఊహ సిరి ఆధ్వర్యంలో బాలికలకు గంజాయి మరియు డ్రగ్స్ మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస అయి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. మంచిగా చదువుకొని ఉన్నతమైన శిఖరాలు ఎదగాలని తెలియజేశారు. పై కార్యక్రమాలలో టాస్క్ ఫోర్స్ సీఐ ఎం బాలకృష్ణ, సూళ్లూరుపేట ఇన్స్పెక్టర్ కే సురేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# 26న ఒంగోలు కలెక్టరేట్ వద్ద మహాధర్నా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావేతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 26న ఒంగోలు కలెక్టరేట్ వద్ద మహాధర్నాల జయప్రదం చేయండి ఈరోజు కార్మిక కర్షక ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో ఎస్ కే యం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సందర్భంగా చుండు రంగారావు మాట్లాడుతూ మహా దన్నాలో వ్యవసాయ పంటలకు సరైన మద్దతు ధరలు లేనందున భారత రైతాంగానికి ఏటా సుమారు మూడు లక్షల కోట్ల మీరు నష్టం వాటిల్లుతుందని వారు నివేదికల పేర్కొన్న నేపథ్యంలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ రైతు కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి చట్టబద్ధ ఎం.ఎస్.పి ప్రకటించాలి, ప్రకృతి వైపరీత్యాలు చేయడం ధరల పతనం రుణభారం వల్ల లక్షల యాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడి నేపథ్యంలో ఒక పర్యాయం పంట రుణాల బకాయిలను మాఫీ చేయాలన్నారు. రైతుల ఆత్మ ఇచ్చిన నివారణకై కేరళ తరహాలో రైతు రుణ ఉపశమను చట్టం పార్లమెంట్లో ఆమోదించి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలన్నారు. రైతులు వ్యవసాయ కార్మికులకు నెలకు 10,000 పెన్షన్ సౌకర్యం వర్తింపజేయాలి. కౌలు రైతుల చట్టంలో భూ యజమాని సంతకం ఉండాలన్న నిబంధన తొలగించాలి దశాబ్దముల పాటు సంఘటన విశక్తితో కార్మికులకు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి తెచ్చిన కార్మిక వ్యతిరేక కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్



కోటను వెంటనే ఉపసంహరించాలి విశాఖ ఉక్కు ప్రైవేటుకలను విరమించాలి ప్రభుత్వ రంగ సమస్యలను కాపాడాలి రైతులు పేదల పాలిట వరి తాడు లాగా ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసర్వలించాలి గృహ వినియోగదారులకు చిన్న వ్యాపారులకు వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్స్ మార్కెట్లను బిగించరాదు 2013 భూ సేకరించటం అమలు చేయాలి. నిర్బంధ భూ సేకరణ చట్టం విరమించాలి, కరువు వరదలు తేడా పేదల వల్ల పని రాష్టపోయిన రైతులకు పరిహార అందించేందుకు ప్రభుత్వ రంగ భీమా కంపెనీల ద్వారా పథకం అమలు చేయాలి ప్రీమియమును కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి ,వేతనం 26,000గా నిర్ణయించి అమలు చేయాలి ,కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ డైరీ వేస్ కంటిన్యూట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి, ఉపాధి హామీ పరిధినాలను 200 రోజులు పెంచి రోజు వే తనం 600 పెంచాలి, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలి . అటవీ హక్కుల పరిరక్షణ చట్టంకు సవరణ చట్టం 2023 ను ఉప సవరించాలన్నారు. ఆదివాసీలు అటవీ నివాసుల హక్కులను పరిరక్షించాలి అటవీ సంపదవనరులను పరిరక్షిస్తున్న ,ఆదివాసీలు ట్రైబ్స్ ప్రజలపై ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలి. ప్రకాశం పాల డైరీ అమూల్ కబంధ హస్తాలు ఉండి బయటకు తేవాలి. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న లీటరుకు ఐదు రూపాయల సబ్సిడీ ఇవ్వాలి పాల ఉత్పత్తిదారుల నుండి పాలను ప్రభుత్వం సేకరించి గిట్టుబాటు ధరలు కల్పించి వారికి జీవన ఉపాధి కల్పించాలి. ఒంగోలులో మూతపడ్డ పాల్పడిపాలపొడి తయారీ యూనిట్ నుపునరుద్ధరించాలి. ప్రకాశం నెల్లూరు కడప ప్రజలకు తాగునీరు సాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టును ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలి. నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ కాలువల పనులు సొరంగా నిర్మాణాలకు తక్షణమే 2000 కోట్లు ప్రకటించాలి గులకమ్మ రిజర్వాయర్ గేట్లు మరమ్మతర తక్షణమే పూర్తి చేయాలి. చివరి భూముల వరకు పూడికలు తీయించాలి. ఈసమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ,సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ,రైతు సంఘం అధ్యక్షుడు అధ్యక్షులు జుజ్జురి జయంతిబాబు ,రైతుసంఘం జిల్లా కార్యదర్శి కుర్రా వీరారెడ్డి ,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోనూరు వెంకటేశ్వర్లు ,ఐయఫ్ టియు నాయకులు చొప్పర జాలన్న తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగిసిన గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్తీక వనభోజనం మహోత్సవం










(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 24)

ఆదివారం పట్టణంలోని గోశాలలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘ కార్తీక వనభోజన మహోత్సవం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా దంపతులతో సామూహిక శివపార్వతుల శాంతి కళ్యాణం నిర్వహించారు. తదుపరి పొదిలి యూనిట్ అధ్యక్షుడు చిట్టెంశెట్టి వెంకటకృష్ణరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు గ్రోసు సుబ్బారావు మాట్లాడుతూ గాండ్ల సామాజిక వర్గ ప్రజలు ఐకమత్యంగా ఉండాలని ఏదైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్థికంగా విద్యాపరంగా ఎదగాలని సుబ్బారావు ఆకాంక్షించారు.ప్రపంచం మొత్తం నూనెల మీద ఆధారపడిందని,అలాంటి నూనెలు తయారు చేసే సామాజిక వర్గం మనదని, నూనె గానుగలను ఏర్పాటు చేయాలనుకున్నవారు తనను సంప్రదిస్తే లోను ఏర్పాటు చేస్తానని, అదేవిధంగా ప్రతి ఒక్కరు గానుగ నూనెలు వాడాలని ఆకాంక్షించారు. తదుపరి ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి, ప్రకాశం జిల్లా గౌరవ సహాదారులు తంగేళ్ల నాగభూషణం మాట్లాడుతూ పొదిలిలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన మహోత్సవానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరవ్వడం అభినందనీయమని తెలిపారు. తదుపరి సాంప్రదాయబద్ధ భోజనాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అనంతరం మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలైన మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, సూది దారం, తాడు లాగడం, స్పూను నిమ్మకాయ, మొదలగు పోటీలు నిర్వహించి, విజేతలకు శేషగిరి చంద్ర దంపతులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, బట్టు రామారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తిరుపతి తిరుపతి హరిగోపాల్, వరికుంట్ల రాజా, చిట్టెం శెట్టి శ్రీనివాసులు(నూతల పాడు) భీమవరపు సహదేవుడు, గుంటక కృష్ణ, ఊటుకూరి ప్రసాదు, జిల్లా ప్రధాన కార్యదర్శి వరికుంట్ల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి హనుమంతరావు, ప్రకాశం జిల్లా యూత్ కన్వీనర్ రోషన్ బాబు, అనూష,ఎజిటియుపి ఎస్ఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు సురేష్ రాగ వీన, నలబోలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




# 68వ బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 24)

ఒంగోలు కేంద్రంగా బాబా సాహెబ్ అంబేద్కర్ తానే స్వయంగా స్థాపించిన ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షులు మహేష్ నాగ వారి ఆధ్వర్యంలో 68వ బౌద్ధ ధమ్మ దీక్ష ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని దమ్మ ర్యాలీని త్రిశరణాలు వల్లిస్తూ అంబేద్కర్ భవనం వద్ద నుండి, మిరియాల పాలెం సెంటర్ అంబేద్కర్ విగ్రహం మీదుగా తిరిగి అంబేద్కర్ భవనం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీబీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివి దుర్గారావు, నేషనల్ సెక్రెటరీ వై కొండల్ రావు ,నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఇ. నాగేశ్వరావు , స్టేట్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి రాంబాబు , ఇతర అన్ని జిల్లాల ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా రిటైర్డ్ ఐఏఎస్ జి ఎస్ ఆర్ కె ఆర్ విజయ్ కుమార్ , ఎస్ఎస్డీ నేషనల్ జనరల్ సెక్రెటరీ- దిగంబర్ కాంబ్లె , విసీకే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్జే విద్యాసాగర్ విచ్చేశారు. డిసెంబర్ కాంబ్లే గారు మాట్లాడుతూ భారతదేశానికి బౌద్ధం యొక్క అవసరం చాలా ఎక్కువగా ఉందని, బౌద్ధం లేకపోతే దేశం మొత్తం అసమానతలతో విచ్ఛిన్నమై సమాజమే శిధిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని ఉద్ఘాటించారు. రిటైర్డ్ ఎస్ జి ఎస్ ఆర్ కె ఆర్ విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ బౌద్ధం వల్ల మంచి మానవతా విలువలు కలిగినటువంటి సమాజం చేకూరుతుందని, ఆ సమాజం ద్వారా మనిషికి ప్రజ్ఞ, శీల, కరుణ అనేవి వస్తాయి అని వాటి ద్వారా భారతదేశాన్ని అసమానతలు లేని దేశంగా తయారు చేయవచ్చా అని అన్నారు. బీసీ కే రాష్ట్ర అధ్యక్షులు ఎన్ జే విద్యాసాగర్ గారు మాట్లాడుతూ.. ఇప్పుడు అస్పృశ్యులంతా రకరకాల ఉద్యమాలు చేసుకుంటూ చివరికి జై భీమ్ అనే నినాదంతో ముగిస్తున్నారని, నిజమైన సమాజాభివృద్ధి కావాలి అంటే బౌద్ధం చాలా అవసరం అని అన్నారు.భారతదేశాన్ని ప్రబుద్ధ భారత్ ను సాధించే దిశగా అడుగులు వేస్తూ ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో జరగాలని ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి మయన్మార్ నుంచి బౌద్ధ బిక్కు ఆయూపాల, తెలంగాణ నుండి ఉజ్వల్ భరద్వాజ్ బిక్కులు దమ్ము ఉపదేశాన్ని ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 50 మంది దమ్మ దీక్షను స్వీకరించారు, ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలువురు మేధావులు బౌద్ధులు అంబేద్కర్ వారసులు విద్యార్థినీ విద్యార్థులు వందలాదిగా తరలివచ్చారు.ఈ కార్యక్రమానంతరం టీబీఎస్ఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్ బి. రాజేష్, కే అనిల్, కే. రామకృష్ణ, వై. సిద్ధార్థ, ఉబ్బా ఆనంద్ సాయి, సిహెచ్ బాబు, డి శ్రీను, కే వెంకటేశ్వర్లు, గురవయ్య, టి బాబురావు, ఎంఈఓ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర వర్ధన్, జి నాగేశ్వరరావు, డాక్టర్ సుధాకర్, కేకే బోధి, ఎన్ వెంకట్, నవీన్, డి ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.



## దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహణ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 24)

మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామపంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున దోమల నివారణ భాగంగా ఫాగింగ్ నిర్వహించడం జరిగింది. ఆదివారం నుంచి మొదలు పంచాయితీ మొత్తం ఫాగింగ్ నిర్వహిస్తామని పంచాయతీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ మానికల నాగలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఎండి అల్తాఫ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన ధన్యాసి విమలమ్మ, పసుపులేటి పద్మ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 24)

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరావుని స్థానిక నాయకులతో కలిసి ఉలవపాడు మండల సమైక్య అధ్యక్షురాలుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల సమైక్య అధ్యక్షురాలు (వెలుగు) ధన్యాసి విమలమ్మ, కోశాధికారి పసుపులేటి పద్మలు పాల్గొన్నారు.

## యాదవ్ కులస్తులు అన్ని విధాల్లో ముందుండాలి

మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 24)

యాదవ్ కులస్తులు రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితుల్లో ఉన్న వారికి తమ పూర్తి సహాయ కార్యక్రమాలు అందుతాయి అని మాజీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు తెలిపారు. ఆదివారం నెల్లూరు పట్టణంలోని కార్తీకమాసం సందర్భంగా యాదవులు ఏర్పాటు చేసిన వనంహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు అభ్యున్నతికి తాము ఇప్పుడు కట్టుబడి ఉన్నామని చెప్పారు. వారికి విద్యా వైద్య విషయంలో ఎల్లప్పుడూ అండగా ఉండాలని తెలిపారు. అలాగే నాకు ఉన్న వ్యవస్థలో 4500 మంది ఉద్యోగులు ఉన్నారని, 4500 కుటుంబాలకు నేను తోడుగా ఉన్నానని ఆయన తెలిపారు. అలాగే అందరూ మీ ఎదవ కులంలో అద్భుతగలమైన ఆలోచనతో ఉన్నారు మునుముందు వారి నుండి కూడా చాలామందికి ఉద్యోగ అవకాశాలు, విద్యా, వైద్య సహాయక సదుపాయాలు కలుగుతాయని వారు చెప్పారు యాదవులు తన దగ్గరకు వస్తే పూర్తి సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌తో పాటు యాదవ నాయకులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# అందరికీ అందుబాటు ధరల్లో గార్డెన్ సిటీ సద్వినియోగం చేసుకోండి










(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 24)

నెల్లూరు నగరంలోని అంబాపురం రామకోటి నగర్ గార్డెన్ సిటీ లేఔట్ (నుడా అప్రూవల్) నూతన వెంచర్ కన్నడ సినీ హీరోయిన్ ప్రియా హెగ్డే చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైనది. ఈ సందర్భంగా హీరోయిన్ ప్రియ హెగ్డే మాట్లాడుతూ శ్రేయ రియల్ ఎస్టేట్ లిమిటెడ్ గ్రూప్స్ నాకు ఫ్యామిలీతో సమానము శ్రేయ గ్రూప్స్‌తో నా ఈ ప్రయాణం ఈ నాటిది కాదు ఎప్పటి నుండో నేను శ్రేయ గ్రూప్స్ అన్ని ప్రోగ్రామ్స్‌కి అటెండ్ అయ్యి నా బెస్ట్ విషెస్ వాళ్ళకి అందిస్తూనే ఉంటాను. అందరూ నన్ను ఇప్పుడు ప్రియ హెగ్డే కాకుండా స్నేహ డే అని పిలవడం మొదలుపెట్టారు. ఆ ఘనత అంతా శ్రేయ రియల్ ఎస్టేట్ వారిదే...నా ఈ పుట్టిన రోజున ఈ నూతన గార్డెన్ సిటీ లేఔట్ ను ప్రారంభించడం అందులో పాత్రులు కావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గార్డెన్ సిటీ శ్రేయ గ్రూప్స్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ ఓనర్ బాబు మాట్లాడుతూ అందరికీ అందుబాటు ధరల్లో నూతన లేఅవుట్ గార్డెన్ సిటీ నెల్లూరు నగరంలోని అంబాపురం రామకోటి నగర్ గార్డెన్ సిటీ లేఔట్ (నుడా అప్రూవల్) నూతన వెంచర్ కన్నడ సినీ హీరోయిన్ ప్రియా హెగ్డే చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైనది.

16 ఎకరాల విస్తీర్ణంతో ఈస్ట్ ఫేసింగ్కు అనుకూలంగా మా ఫ్లాట్స్ కట్టబడుతున్నాయని కావున ప్రతి ఒక్కరు వచ్చి విసిట్ చేసి మా వద్ద ఫ్లాట్స్ బుక్ చేసుకోవాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఓపెనింగ్ కి ముందుగానే ఫ్లాట్స్ కొనుగోలు చేసినటువంటి వ్యక్తులకు పరిష్కారంలో మరో బహుమతులు ఇచ్చి, కొంతమందికి వారి వద్ద ఫ్లాట్స్ కొనేలాగా ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు, ప్రముఖులు ,బంధుమిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# ఇందిరమ్మ ఫేస్ 1, 2 కాలనీలను పరిశీలించిన ఎమ్మెల్యే కందుల







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 24)

మార్కాపురం శివారులోని ఇందిరమ్మ ఫేస్ 1, 2 కాలనీలను ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన మౌలిక వసతులపై ఆయన ఆరా తీశారు. కాలనీ సౌకర్యాలకు సంబంధించి కొత్త ఎస్టిమేట్స్ తయారు చేసి తనకు అందజేయాలని హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాలనీలో నీరు, రహదారులు, సైడు కాలువలు వంటివి ఏర్పాటు చేస్తే గృహాలు నిర్మించుకుంటామని ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు పూర్తి సహకారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్24): ఉపాధ్యాయులకు తమ ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలను అందిస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకొని ఒంగోలు పట్టణంలోని సంతపేట నందుగల టిటిడి కళ్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పివిఆర్ స్కూల్ వద్ద నుండి సంతపేట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చాలా గౌరవం అని గుర్తు చేశారు, ఎంతోమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులది అని కొనియాడారు, గడిచిన ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన ఫిట్మెంట్లను ఇవ్వకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను అన్ని విధాలుగా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రజలందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రతినెలా ఒకటవ తేదీన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ అయిన సిపిఎస్ రద్దును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మీ తరపున పోరాడుతామని, ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హామీ ఇచ్చారు, ఉపాధ్యాయుల సమస్యలను అన్ని విధాలుగా పరిష్కరిస్తామని తెలిపారు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50వ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఒంగోలు నగరం వేదికగా రెండు రోజులపాటు ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయ సంఘాలలో యుటిఎఫ్ ప్రప్రదమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస రావు ,ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె వెంకటేశ్వరరావు,జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ తోపాటు యుటిఎఫ్ ఫెడరేషన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# పార్కులను అద్భుతంగా తయారు చేసేందుకు రంగం సిద్ధం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, నవంబర్ 24)





28వ డివిజన్లో పార్కుల సుందరీకరణకు ఎంతగానో సహకరించారు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. దీంతో పార్కులను అద్భుతంగా తయారు చేయడానికి రంగం సిద్ధమైనట్లయింది. డివిజన్లో ఉన్న 5పార్కులకు గాను 4 పార్కులలో పిల్లలు ఆడుకునే ఆట వస్తువుల మరమ్మత్తులు చేయించి, కొత్త ఆట వస్తువులు పెట్టించి, పార్కులో ఉన్న గోడలకు అద్భుతంగా పెయింటింగ్ చేయించి, గార్డెన్ నీటుగా కటింగ్ చేయించి, సుందరంగా తయారు చేయిస్తున్న డివిజన్ కార్పొరేటర్ చెక్క అహల్య సాయి సునీల్. డివిజన్లోని చైతన్యపురి కాలనీలో ఉండే రెండు పార్కులు, జర్నలిస్ట్ కాలనీలో ఉండే పార్కు ,హౌసింగ్ బోర్డ్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దడం జరుగుతూ ఉంది. ఈ పార్కుల పున నిర్మాణానికి ఎంతగా సహకరించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, పార్కుల విషయం చెప్పి చెప్పగానే మాకు ఎంతగానో సహకరించిన రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# విద్యుత్ సమస్యల పై అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, నవంబర్ 24)

అద్దంకి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యలపై ఆ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గం పరిధిలో నూతనంగా నిర్మింపదలచిన సబ్ స్టేషన్లకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకుని రెవెన్యూ అధికారుల సమన్వయంతో త్వరితగతిన భూసేకరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామాలకు నాణ్యమైన విద్యుత్తు అందేలా త్రీఫేస్ లైన్లు ఏర్పాటు, నూతన వ్యవసాయ కనెక్షన్లు మంజూరుకు సంబంధించి ఏ గ్రామాలలో ఎంతవరకు జరిగాయి? ఎలా జరుగుతున్నాయో వాకబు చేశారు. ఈ సందర్భంగా అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా అద్దంకి నగర పంచాయతీ అద్దంకి మండలం,మేదరమెట్ల పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.గ్రామాల్లో సైతం నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆదిశగా నియోజకవర్గ పరిధిలో విద్యుత్ వినియోగం (లోడ్) అవసరాన్ని బట్టి కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నూతన వ్యవసాయ కనెక్షన్ల మంజూరు కొత్త ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ, ఈఈ, డిఈ, తదితరులు పాల్గొన్నారు.

